కథా నిలయం
శ్రీకాకుళం

నీళ్లధార

ఎక్స్‌ప్రెస్ అరగంట లేటు అని తెలుసుకుని, ఏమీ తోచక ప్లాట్‌ఫారం ఆమూలనించి, ఈమూలదాకా రెండు సార్లు తిరిగి, చివరికి హిగిన్‌బాదమ్స్ బుక్‌స్టాల్ దగ్గర నిలబడ్డాడు పున్నారావు. రకరకాల పుస్తకాలు అనేకానేక ఆకర్షణలతో అరల్లోంచి తొంగిచూస్తూ కొనేవాడికోసం కాచుకు కూచున్నట్టుగా ఉన్నాయి. అవన్నీ సింహావలోకనం చేస్తున్న పున్నారావుకి తనకొట్లో అమ్ముడుపోని ఫాన్సీ స్టాకు జ్ఞప్తికొచ్చింది. ఎన్ని పుస్తకాలు! ఇవన్నీ ఎవరు కొంటారో! పున్నారావుకి అమిత ఆశ్చర్యం వేసింది. ఈ పుస్తకాల షాపుల్ని గురించి తనెప్పుడూ అంతగా ఆలోచించలేదు. బహుశా తన కొట్లో ఫాన్సీసామాన్లని చూసికూడా జనం అలాగే ఆశ్చర్యపోతారేమోననే ఊహ వెంటనే

పున్నారావుకి తట్టింది. తనలాంటి వ్యాపారికూడా ఒక్క క్షణం మూఢుడై పోయినందుకు పున్నారావు కాస్త చింతించాడు. అన్నట్టు, తను పుస్తకం – ఏదైనా–కొని ఎన్నాళ్ళయింది! ఈ మధ్యగావును ఒకటో క్లాసు పుస్తకం కొన్నాడు కొడుక్కి. అప్పుడప్పుడు ఏవో పత్రికలు చదవాలని ఉబలాటం కలిగితే ఏ లైబ్రరికో వెళ్ళి చదివేవాడు.

అవును, మరి. పుస్తకం కొనటమంటే మాటలా? అయినా తనకంత అభిరుచి లేదు–ఈ పుస్తకాల్లో రాసే విషయాలమీద. జీవితం అంతా డబ్బుతో కూడుకుని ఉంది. సంపాదించాలి. రెండుచేతులో సంపాదిస్తేగాని వ్యవహారాలు కుదటబడవు. పున్నారావు కొంచెం నవ్వుకున్నాడు. వ్యవహారాలు కుదుటబడాలిసినవి తనకేమున్నాయిగనుక. ఏమీ లేవు. నిజమే.

కాని అన్నప్పుడల్లా వ్యాపారం లాభించదు. జాగ్రత్తగా నిర్వహించుకుంటూ రావాలి. తనకి ఇరవైనాలుగ్గంటలూ ఈ వ్యాపారంతోనే సరిపోతుంది. ఏమిటో, ఇప్పుడు తన ప్రయాణంకూడా వ్యాపార సంబంధమైందే. సరదాగా ప్రాయాణంచేసి ఎన్నాళ్ళయింది! ఎప్పుడూ ధరలూ, వస్తువులూ, మార్కెట్లూ, పున్నారావుకి కొంచెం విసుగు పుట్టింది. పుస్తకాలవైపు చూస్తున్నకొద్దీ అతనికి విసుగు మరింత ఎక్కువ కాసాగింది. ఈ పుస్తకాల్లో ఏమేం విషయాలు రాసుంటారో! వీటిల్లో ఎంత విజ్ఞానముందో! ఒక్కక్షణం పున్నారావు తను కాలేజీచదువు చదవనందుకు

విచారించాడు. తను చదవగలిగితే ఎంత బావుండేది. ఫిఫ్త్ ఫారం మధ్యలోనే మానెయ్యాలనే దుర్బుద్ధి తనకెందుకు కలగాలి! పున్నారావు మనసులో అశాంతి బయలుదేరింది.

విసుగూ, అశాంతితో ఆలోచనలు సాగక ఉబుసు పోకకి పున్నారావు బుక్‌స్టాల్‌లోని ఓ సినిమాపత్రిక తీసుకుని పేజీలు తిప్పసాగాడు. అందులోని అందమైన బొమ్మలూ, కొత్తకొత్త సినిమాలు వివరాలూ, అవీ చూస్తుంటే కోల్పోయిన ఉత్సాహం తిరిగొస్తోంది అతనికి. ఇంతలోనే స్టాల్ యజమాని పున్నారావువైపు చురచుర చూసి "ఏమండీ, అది మీరు కొంటారా?" అని అడిగాడు. పున్నారావు కొంచెం తటపటాయించాడు. వెలచూశాడు. అర్ధరూపాయి. అబ్బో! అర్ధరూపాయ్! వెధవది, చదవటానికి— లేక చూడటానికి— అర్ధగంట కూడా పట్టదు. తరవాత ఎందుకు పనికొస్తుందీ! శుద్ధ దండగ. పొట్లాలు కట్టటానిక్కూడా పనికిరావు ఆ పేజీలు—చిన్నచిన్నవి. పున్నారావుకి కొనటానికి అంత ఇష్టం కలగలేదు. మిగతా పేజీలు గబగబా తిప్పుతూ: "చూస్తున్నానండీ, బావుంటే తీసుకుంటాను", అన్నాడు కొంచెం గొప్పగా. అయితే ఆ షాపుయజమాని పున్నారావు గొప్పతనం ఇత్యాదులు ఏమీ లెక్కచెయ్యకుండా, అతడు ఏమనుకుంటాడోనని ఆలోచించనుకూడా ఆలోచించకుండా కాస్త కటువుగా కూడా అన్నాడు: "అలా చూడడానికి వీల్లేదండీ." పున్నారావుకి అభిమానం ముంచుకొచ్చింది. ఎంతమాటన్నాడు. తన కొట్లో కాతాదార్లతో ఇలాగే ప్రవర్తిస్తున్నాడా? వొచ్చినవాళ్ళందర్నీ మర్యాదగా

పరామర్శించి, ఏంకావాలో కనుక్కొని, వాళ్ళు వొద్దన్నకొద్దీ బలవంతాన వస్తువుల రకాలన్నీ చూపించి ఎంత మర్యాదగా ప్రవర్తిస్తాడు! మీరు కొంటేనే చూడండి, లేకపోతే వస్తువు ముట్టుకోటానికికూడా వీల్లేదని తను ఎప్పుడైనా అన్నాడా? వ్యాపారానికి కావలిసింది ముఖ్యంగా వినయవిధేయతలని ఈ పెద్దమనిషికి తెలియదేం! ఎంతమాట అనేశాడు. తన ముప్పైఏళ్ళ జీవితంలో ఎప్పుడూ, ఎవరిచేతా పడనిమాట! రోషం ముఖంలోకి చిమ్మింది. అర్ధరూపాయి విసరి అతని ముఖాన కొట్టాలనిపించింది. కాని పున్నారావుకి మొదటినించీ లభించిన తరిఫీదు అందుకు భిన్నప్రకృతి గలది. తమాయించుకున్నాడు. దర్జాగా జేబులోంచి అర్ధరూపాయి తీసి అతనివైపుకూడా చూపకుండా—అన్నట్టు అర్ధరూపాయి తనదగ్గర లేదు. రూపాయినోటు తీసి—అతనివైపుకి నిర్లక్ష్యంగా గిరవాటు వేసి పుస్తకం పేజీలు తిప్పుతుంటే ఆ షాపు యజమానికి తలకొట్టేసినట్టుండదూ? పున్నారావు ఇంచుమించు అలాగే చెయ్యబోయాడు కాని చివరిక్షణంలో అతనిబుద్ధి మళ్ళింది. అర్ధరూపాయి! పుస్తకం చదివేసింతరవాత—అంటే ఓ అరగంట తరవాత—అప్పుడుగాని తనకి తెలియదు, తను చెయ్యబోయే తెలివితక్కువ పనిలోని తొందరపాటు. ఆ అర్ధరూపాయే ఉంటే జట్కాబండి కిరాయికైనా అక్కరకొస్తుంది. పుస్తకం ఏం ఉద్ధరించను!

పున్నారావు ముఖంచిట్లించి—పూర్తిగా ఇష్టంలేకపోయినా, ఆ బొమ్మల్ని ఇంకా చాలాసేపు చూడాలనిపిస్తున్నా, ముందు పేజీల్లో ఏలాంటి బొమ్మలూ, విషయాలూ

ఉన్నాయో చూడాలనిపిస్తున్నా—బలవంతంగా, వెధవ పుస్తకం, ఇందులో ఏముంది. అన్నట్టుగా అలా చేతుల్లోంచి వొదిలేశాడు.

అంత అవమానం పొందిన తరవాత, అది దిగమింగుకుని ఇంకా ఆ పుస్తకాల కొట్టుముందు నిలబడటం సబబు కాదు గనుక పున్నారావు వెంటనే అక్కణ్ణించి కదిలి అడుగు వేశాడు. జరిగింది తలుచుకుని దాన్ని గురించి ఆలోచించటం మనసుకి ఆరోగ్యకరం కాదుగనుక పున్నారావు ఆ విషయం వెంటనే మర్చిపోయేందుకు వీలుగా మరోసంగతి మీదికి మనసు తిప్పాడు. ఇందాక జేబులో చెయ్యి పెట్టి చూసుకుంటే చిల్లర తగల్లేదు. లేదన్నమాట. పోర్టర్‌కి డబ్బివ్వాలసి ఉంటుంది తరవాత. అతని దగ్గర ఉంటుందో ఉండదో చిల్లర. లేకపోతే ఇబ్బంది. ఇప్పుడే మార్చుకుని దగ్గరుంచుకోటం ఉత్తమం. టీ షాపులో చిల్లర అడిగాడు. "తక్కువగా ఉందండీ", అని ఆముదం తాగిన ముఖం పెట్టాడతడు. మిఠాయి, పళ్ళు, కిల్లీలు వగైరా సరుకులమ్మే స్టాల్‌లో అడిగాడు. అతడు, పనిపెట్టుకు ఊరికే చిల్లర ఇవ్వటం వ్యాపార లక్షణం కాదన్నట్టుగా "ఏమైనా తీసుకోండి," అన్నాడు నిర్మొహమాటంగా. ఓ అణా పెట్టి కిల్లీ వేసుకోవచ్చు ననిపించింది పున్నారావుకి. కాని అదేమంత అవసరం లేదు. రెండు వక్కపొడి పొట్లాలు కొనొచ్చు. కాని ఎందుకీ అక్కర్లేని కొనుగోలు! అణా ఉంటే పేపరు కొనుక్కోవచ్చు, రేపుపొద్దున. లేకపోతే, ఇంకో అణా వేసుకుంటే బెజవాడలో కాఫీ తాగొచ్చు, లేకపోతే పోర్టర్

కివ్వటానికి సరిపోతుంది. ఎలాగో ఆ పోర్టరే సంపాదించుకొస్తాడులే చిల్లర — అనుకుని పున్నారావు "అక్కర్లేదులే" అనేసి ఆ కొట్టు దగ్గర్నించి వొచ్చేశాడు.

ఎక్స్‌ప్రెస్ వాయిదాటైంకి వొచ్చేసింది. పున్నారావుని 'జనతా, ఇంటరా, బాబు?' అని అడిగి మూడో తరగతేనని సమాధానం పొంది పోర్టర్ పున్నారావు తాలూకు బరువు నెత్తిమీద పెట్టుకుని పరుగుతీశాడు. అతని అడుగుజాడల్లో పున్నారావు బయలుదేరి ఎలాగో ఓ కంపార్ట్‌మెంట్‌లో సామాన్లతోసహా తన శరీరాన్ని తోసేసి, ఒక క్షణం గట్టిగా ఊపిరితీసుకుంటున్న సమయంలో "టైమైంది బాబూ, బిగిల్ ఊదారు", అని హెచ్చరించాడు పోర్టర్. పున్నారావు జేబులోంచి రూపాయినోటు తీసి పట్టుకుని, "చిల్లరియ్యి" అన్నాడు. పోర్టర్ కొంచెం గాభరాపడి 'లేదు బాబూ—' అని, ఐనా నమ్మకం కలగటానికి జేబులో చిల్లరతీసి అరచేతిలో పరిచి లెక్కపెట్టి "ఆరణాలే ఉంది బాబూ", అన్నాడు.

పున్నారావు అతని మెత్తదనం చూసి ఇద్దరూ మెత్తగా ఉండటం వ్యవహార పరిష్కార సాధనకి పనికిరాదని "ఎలామరి, ఎలాగోచూడు, త్వరగా", అన్నాడు. పోర్టర్ హడావిడిగా నలుగురైదుగుర్ని అడిగాడు. టైం ఐపోతోంది. చిల్లర దొరకలేదు. అతని ఆదుర్దా చూస్తే పున్నారావుకి జాలేసింది.

కాని ఏంచేయాలి? జండా ఊపాడు గార్డు. ఇంజన్ అరిచింది. ఇప్పుడు పున్నారావుకి గాభరా పుట్టింది. అతనికి

పోర్టర్ కివ్వాలిసిన రెండణాలు ఎగ్గొట్టాలని ఏకోశానా లేదు. అలాంటి అన్యాయాలు తను ఇంతవరకూ ఎరగడు. ఇంతలో పత్రికల కుర్రాడు 'ఇలస్ట్రేటెడ్ వీక్లీ', సార్ అని కేకేశాడు. పోర్టరు ఆకుర్రాడిని అడిగాడు. అతనిదగ్గర నాలుగణాలు మాత్రం ఉన్నాయి. పున్నారావుకి ఆలోచించటానికి వ్యవధి లేదు. రైలు కదిలింది. వెంటనే అతడు వీక్లీ తీసుకుని, మిగతా చిల్లరలో రెండణాలు పోర్టరు కిచ్చేశాడు. పోర్టర్ కృతజ్ఞతతో ఊరికే ధర్మం తీసుకున్నట్టుగా ఫీలయినట్టు ముఖంపెట్టి వెళ్ళిపోయాడు.

పున్నారావు చేతుల్లో "వీక్లీ" చూసి ఇద్దరు కాలేజ్ స్టూడెంట్లు తమదగ్గర అతనికి స్థానం ఇవ్వటానికి అభ్యంతరం పెట్టకపోవటంవల్ల, సులభంగానే కూచోటానికి స్థలం దొరక టంచేత పున్నారావు కుదురుగా కూచుని పత్రిక అట్టమీద తన పేరు ఇంగ్లీషులో దర్జాగా రాసి, పేజీలు తిప్పసాగాడు. బొమ్మలైతే ఏవేవో పెద్దపెద్దవీ, రంగు రంగులవీ ఉన్నాయి గాని వాటికింద రాసిన అక్షరాలు పున్నారావుకి అంతగా కొరుకుడుపడలేదు. తన ఫిఫ్త్‌ఫారం ప్రమాణం చదువు ఈ విషయంలో ఎందుకూ కొరగాదని పున్నారావు తెలుసు కున్నాడు. ముప్పావలా పెట్టి కొన్నాడు. అతని గుండెలు గుభేలుమంది. ఆ పత్రిక పట్టుకున్న చేతులు వొణకసాగాయి. ఏం చేసుకునేట్టు! అందులోని ఒక్క మాటా తనకి అర్థం కాదు. పదిహేనేళ్ళకిందట ఇంగ్లీషుపుస్తకం పట్టుకుంటే మామూలుగా వొచ్చే తలనొప్పి యిప్పుడు తిరగబెడుతోంది. బుద్ధిపూర్వకంగా కొన్నాడు. కొనేప్పుడు తనకి స్పష్టంగా

తెలుసు—అది ఇంగ్లీషు పత్రిక అనీ, అది తనకి పరాయిభాష అనీ. అయినా కొన్నాడు. అవసరం అలాంటిది. సరే. ఇప్పు డేమనుకునీ చేసేదిలేదు. కాని—ఆ సినిమా పత్రికకొన్నా బాగుండిపోయేది. అది ఈ కుర్రాడు ఎందుకు అమ్మకూడదు! ఆ సినిమా పత్రికే కొంటే—అటు ఆ షాపులోని పెద్ద మనిషికి బుద్ధి చెప్పినట్టూ ఉండేది, తన కోరికా తీరేది! పొరపాటయిపోయింది. పోనీ, తను ఒక్క అణాకోసం లోభిం చాడుగానీ, ఓ కిల్లీ కొంటే సరిపోయేది గాదూ? తను ఇంత తెలివితక్కువగా ఎలా ప్రవర్తించాడు?

పున్నారావు గతాన్నిగురించి ఇలా విచారిస్తూండ టంతో ప్రస్తుతం తన చేతిలోని పుస్తకం సంగతి మర్చిపోయి, అప్రయత్నంగా దాన్ని మూసేశాడు. ఆ సమయంకోసమే కనిపెట్టుకు కూచున్న కాలేజీ కుర్రాళ్లు పున్నారావుపట్ల చాలా గౌరవం చూపిస్తూ, ఓసారి ఆ పత్రిక తాము చూడ టానికి వీలవుతుందా అని అడిగారు. పున్నారావు వెంటనే ఇచ్చేశాడు ఉదారంగా—తన కిప్పుడు చదవటానికి ఎలాగూ తీరిక లేదన్నట్టుగా.

పున్నారావుకి ఆ పత్రిక రాను రాను ఓ సమస్య ఐపోయింది. దాన్ని చూస్తుంటే అతనికి భయంకూడా వెయ్య సాగింది. కొంపదీసి, తనని ఎరిగున్నవాళ్లు తన దగ్గర ఆ పత్రిక ఉండటం చూస్తే...

"ఏరోయ్, పున్నారావ్—ఇంగ్లీషుపత్రిక కొన్నావే!" అని ఎవరూ అనలేదుగాని—అన్నట్టే పున్నారావు ఉలిక్కి పడ్డాడు. పెట్టెఅంతా కలయచూశాడు. ఎవరూ తనకి

తెలిసినవాళ్లు లేరు. రక్షించారు. కాని రైలు దిగగానే ఎవరో తారసపడక మానరు. ఈ కాలేజీకుర్రాళ్ళముందే అలా ఎవరైనా తనని ప్రశ్నిస్తే... ఆ క్షణంలో పున్నారావు అను కున్నాడు—ఈ కుర్రాళ్ళు ఈ పత్రిక కొట్టేస్తే బావుండుననీ. ఇంతలో నవ్వులు గలగలా వినిపిస్తే తలెత్తిచూశాడు. ఆ కుర్రాళ్ళిద్దరూ నవ్వుతున్నారు. తనని చూసి కాదుగదా అనుకున్నాడు పున్నారావు. కాదు. వాళ్ళు అందులోని హాస్యాన్ని దేన్నిగురించో నవ్వుతున్నారు. వాళ్ళలోవాళ్లు మెచ్చుకుంటున్నారు. తను ఆనందించగల పరిస్థితిలో లేనందుకు విచారించాడు. న్యాయంగా అలా ఆనందించగల హక్కు మొదట తనది. తనకి ఆ భాష వచ్చివడవదు. పోనీ, వాళ్ళని కనుక్కుంటే—కొంతైనా తృప్తి. కాని అలా అడగ టానికి మనస్కరించలేదు పున్నారావుకి. వాళ్ళ నవ్వులు ఎక్కువ అవుతున్నకొద్దీ పున్నారావుకి వొళ్లు మండిపోయింది. తనకేదో దురన్యాయం జరుగుతూన్నట్టుగా అతడు బాధపడ సాగాడు. తన డబ్బుతో వాళ్లు అన్యాయంగా తనకి దక్క నియ్యకుండా తన హక్కుల్ని భంగపరిచి ఆనందిస్తున్నారు. వాళ్ళసౌఖ్యానికి, వాళ్ళ సంతోషానికి తను డబ్బు పెట్టుబడి పెట్టాడు. వాళ్ళకి రైల్లో ఏమీ తోచదని తను వాళ్ళకి పత్రిక కొనిపెట్టినట్టుగా—తను కావలసింది కొనుక్కోకుండా— ఫీలయాడు. పున్నారావులో ఏవో భావాలు పుట్టిపెరిగాయి. తను ఇక్కడ నానాబాధపడుతూ, వాళ్ళని తన ఖర్చుతో ఎందుకు సంతోషపెట్టాలో అతనికి అర్థంకాలేదు. ఆ కోప తాపావేశాల్లో కొంచెం కటువుగా అడిగాడు: “ఆ పత్రిక

చూడటం అయితే ఇస్తారా ఓసారి ?" ఆ కుర్రాళ్ళిద్దరూ కొంచెంసేపు ఆశ్చర్యపోయి, తరవాత కాసేపు పశ్చాత్తాపపడి, తరవాత కాసేపు కోపం తెచ్చుకుని ఇచ్చేశారు పున్నారావుకి పత్రికని. అయితే పున్నారావుకి వెంటనే ఓ సమస్య ఎదురయింది. కొంచెం అనాలోచితంగానే ప్రవర్తించాడని చెప్పాలి. వాళ్ళు చదువుతున్న పత్రికని అలా అర్థంతరంగా అడిగి పుచ్చుకున్నప్పుడు దానిభావం ఆ పత్రిక తను చదవాలిసి ఉంటుందని ఆ పరిస్థితుల్లో అర్థమవుతుంది అందరికీ. అయినప్పుడు తను చదవకపోతే మహా మోటుగా ఉండక తప్పదు. పున్నారావు చచ్చినట్టు పేజీలు తిరగెయ్య సాగాడు. పేజీలు తిరగేస్తుంటే అతనికి కడుపులో దేవినట్టవుతోంది. ముప్పావలా దీనికి తగలేసే బదులు ఆ పోర్టర్ కి రూపాయిచ్చి ఆరణాలు తీసుకుంటే ఎంత బావుండేది. ఏదో బీదవాడికి సహాయం చేసినట్టుండేది. పాపం, అతనెంత మంచివాడు, రైలు కదిలిపోతున్నా ఆదుర్దాపడ్డాడే గాని, విదిలించి ఒక్కమాటకూడా అనలేదు. అతన్ని చూస్తే తనకి జాలేసింది. తనకి అప్పుడెందుకు తోచలేదు ! తనెందుకు అన్ని పొరపాట్లు చేశాడు. తనకి బుర్ర పనిచెయ్యటంలేదు. తనలో ధార్మికగుణం నశించిందా? లేక అసలే లేదా ? ఉంటే పోర్టర్ కి ఎక్కువ డబ్బివ్వటానికి తనెందుకు సందేహించాలిసిన అవసరం కలుగుతుంది. సందేహమేమిటి ? అసలా ఆలోచనే కలగలేదు తనకి. చూస్తూచూస్తూ ఎవరూ ఎవరికి ఊరికే డబ్బివ్వరు. నిజం_కాని ఇంచుమించు ఊరికే పారెయ్యటంకంటె పోర్టర్ కిస్తే ధర్మంచేసిన తృప్తి తనకీ,

నాలుగు డబ్బులుదక్కిన సంతోషం అతనికీ ఉండేవి. డబ్బు గల ఈ కాలేజీకుఱ్రాళ్ళ సంతోషానికి పెట్టుబడి పెట్టటంకంటే ఆ బీదవాడికిస్తే తనకి తృప్తిగా ఉండేది.

పున్నారావు ఆలోచనలకి అంతరాయం కలిగింది. ఊరికే పత్రికపేజీలు తిప్పుతున్న అతన్ని చూసి కుఱ్రాళ్ళలో ఒకడు అడిగాడు "వీక్లీ ఫీచర్స్‌లో ముందు మీరేం చదువుతారండీ ?"

యథాలాపంగా, ఏదో అభిరుచి కొద్ది ఆప్రశ్న వెయ్య బడ్డా, పున్నారావుకిమటుకు గాలంగుచ్చుకున్నట్టయింది. ఆ ప్రశ్నలోని ఇంగ్లీషుమాట—ఫీచర్స—అంటే ఏమిటో పున్నారావుకి తెలియలేదు. ముప్పావలా పోయిందని అసలే తను దిగులుగా ఉంటే ఈ కుఱ్రాళ్లు తన మనసుని మరింత పాడుచేస్తున్నారు. పున్నారావు కొంచెం విసుగ్గా ఉన్నట్టు తెలియచేస్తూ అన్నాడు. "ఆఁ. ఏదో-అన్నీ ఒకటేలెండి... ఏదో తోచక చదవటమే." తరవాత ఆ కుఱ్రాళ్లు వాళ్ళలో వాళ్ళే పత్రికలోని 'ఫీచర్స' గురించి మాట్లాడుకో సాగారు.

పున్నారావు పరిస్థితిమాత్రం దుర్భరంగా ఉంది. చేతిలో పత్రికవైపు చూస్తే అతనికేదో బరువుగా ఉంది. ఎప్పుడూ కానీ దుబారాచేసి ఎరగడు. ఒక్కసారిగా దెబ్బ తిన్నాడు. ముప్పావలా డబ్బులు ఎక్కడోపోతే అతని కంత కష్టం ఉండేది కాదు. ఆమాటకొస్తే తను ఓసారి ఒక రూపాయి—లాగు జేబుకి చిల్లుండటం వల్ల—మరోసారి టోకరాలో అర్ధరూపాయి, రెండు మూడుసార్లు చిల్లర

మార్పిడిలో, కాతాదార్లకి ఎక్కువగా పొరపాటున ఇవ్వటం వల్ల సుమారు రూపాయన్నరా పోగొట్టుకోవటం జరిగింది. అప్పుడు తాత్కాలికంగా విచారించకపోలేదుగాని ఎక్కువ సేపు మథనపడలేదు. మర్చిపోయి ఊరుకున్నాడు. కాని ఈసారి, ఆ పత్రిక అంటగట్టుకున్న బరువులా, తనని చూసి నవ్వుతున్నట్టుగా ఉంది. అది తన కళ్ళఎదుట లేకపోతే బాగుండు ననిపించింది పున్నారావుకి. ఈ ఊహ కలిగేసరికి ఎక్స్‌ప్రెస్ కృష్ణాబ్రిడ్జిమీదికి చేరుకుని హడావిడి చేస్తూ పోతోంది. పున్నారావుకి ఓ దివ్యమైన ఆలోచన కలిగింది. తల కిటికీలోంచి దూర్చి కృష్ణలోకి చూస్తూ ఆ పత్రిక నీళ్ళలోకి సూటిగా, ప్రమాదవశాత్తు జరిగినట్టుగా, వొదిలేశాడు. "కృష్ణార్పణం", అనుకుని మనసులో ఓ దణ్ణంకూడా పెట్టేశాడు. పీడ వొదిలిందని అనుకుంటూ పెట్టెలోవాళ్ళ కోసం అన్నట్టుగా, "అరెరె, పత్రిక కిందపడిపోయిందే!" అని కొద్దిగా, చాలా దూరబంధువు పోయినసంగతి తెలిసికొన్న వాడిలా, విచారించాడు. ఈ విషయం విని కాలేజీ కుర్రాళ్లు మాత్రం "ఎంతపని జరిగింది!" అన్నట్టుగా ముఖం పెట్టారు.

"పోతే పోయిందిలెండి, ఏదో ఉబుసుపోకకి కొన్నాను. అది వారం వారం తెప్పిస్తూనే ఉంటానుగనుక, ఇంటిదగ్గర ఇంకో కాపీ ఎలాగా ఉంటుంది." అనుకోకుండా పున్నారావు అద్భుతంగా కోసేశాడు. ఆ కుర్రవాళ్లు మాత్రం బలే మంచి అవకాశం పోగొట్టుకున్నట్టుగా బాధపడి, "అరె,

అయితే మాకిచ్చేసినా బాగుండి పోయేదికదండీ. మీ పేరు చెప్పకుని కాసేపు చదువుకునేవాళ్ళం. వా ళ్లేరుదాకా పోవాలి", అన్నారు.

తనపేరు చెప్పకొని...ఎంత మంచివాళ్లు! తన కా మాటే తోచలేదు. పున్నారావు దిగులుగా నీళ్ళల్లో పల్టీలు కొడుతున్న పత్రికవైపు చూశాడు.